## సైకియాట్రీ అసోసియేషన్ ట్రెజరర్‌గా డాక్టర్ ఎల్ వర్షి చౌహాన్ ఎన్నిక



నియామక పత్రం అందుకుంటున్న డాక్టర్ ఎల్ వర్షి చౌహాన్

విద్యానగర్, జూన్ 22: ఇండియన్ తెలంగాణ సైకియాట్రీ అసోసియేషన్ ట్రెజరర్‌గా ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు, డాక్టర్ ఎల్ వర్షి చౌహాన్ హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొన్ని సంవత్సరాల పాటు జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖానలో సేవలందించారు. ప్రస్తుతం హుజూరాబాద్ ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్నారు. గతంలో ఉత్తమ వైద్యుడిగా అవార్డులు అందుకున్నారు. మానసిక వైద్య నిపుణుడిగా, యువత డ్రగ్స్ బారిన పడకుండా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తు, డీ అడిక్షన్ సెంటర్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు. కాగా, ఆయన ఎన్నికపై పలువురు వైద్యులు, గిరిజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## జగన్నాథ రథయాత్ర పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం

కమాన్‌చౌరస్తా, జూన్ 22 : జిల్లా కేంద్రంలో జూలై 5న జరుగనున్న 4వ జగన్నాథ రథయాత్ర ఉత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ నగరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ ఇస్కాన్ శాఖ పక్షాన జరుగుతున్న 4వ రథయాత్రకు జిల్లాలోని భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇస్కాన్ మందిర నిర్మాణానికి ప్రభుత్వం పక్షాన అన్ని విధాలా చేయూతనందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇస్కాన్ కరీంనగర్ శాఖ నిర్వాహకుడు నరహరి ప్రభుదాస్, రథయాత్ర కమిటీ అధ్యక్షుడు కన్న కృష్ణ, డాక్టర్ ఎల్.రాజభాస్కర్ రెడ్డి, తుమ్మల రమేశ్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం, పోరెడ్డి శ్రీహరి రెడ్డి, రాళ్లబండి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో యోగేశ్వరి



యోగేశ్వరి

కొత్తపల్లి, జూన్ 22: బీహార్ రాష్ట్రంలోని నవాదలో ఈ నెల 18నుంచి 22వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన క్రీడాకారిణి ఎం యోగేశ్వరి పాల్గొన్నదని ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల నల్గొండ జిల్లా నకిరేకల్‌లో జరిగిన జూనియర్స్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న యోగేశ్వరి ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికైందని తెలిపారు. యోగేశ్వరిని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్యామల పవన్‌కుమార్, డీవైఎస్‌వో వీ శ్రీనివాస్‌గౌడ్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నాయకులు అభినందించారు.

## తెలంగాణ పద వైభవం పుస్తకావిష్కరణ

కమాన్‌చౌరస్తా, జూన్ 22 : యోగా సంపత్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ పద వైభవం 51వ పుస్తకాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని భగవతి పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మేయర్ వై సునీల్ రావు హాజరై మాట్లాడారు. తెలంగాణ పద సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు మాడిశెట్టి గోపాల్, రాజారామ్మోహన్ శర్మ, కొండూరి వెంకటేశ్వర్లు, గండ్ర లక్ష్మణ రావు, వేణుశ్రీ, భగవతి రమణారావు, కొత్త అనిల్, అనంతాచార్య, కల్వకోట సంతోష్ బాబు, విలాసాగరం రవీందర్, కిషన్, చింతం సునీత, సత్యం రాజు, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## యాదవుల ఆత్మగౌరవ సభ విజయవంతం చేయాలి

హుజూరాబాద్ టౌన్, జూన్ 22: యాదవుల హక్కుల సాధన కోసం ఈనెల 30న హైదరాబాద్‌లో యాదవ ఆత్మగౌరవ సభను ఏర్పాటు చేసినట్లు బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు, యాదవ సంఘం నాయకుడు రాజారామ్ యాదవ్ తెలిపారు. ఆదివారం పట్టణంలో ఆయన యాదవ ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. మంత్రివర్గంలో యాదవులకు స్థానం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. యాదవ కార్పొరేషన్‌కు పదివేల కోట్ల రూపాయలు కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో యాదవులకు స్థానం కల్పించాలన్నారు. హక్కుల సాధన కోసం రాష్ట్రంలోని యాదవులు 30న హైదరాబాద్‌లో జరిగే సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కన్నవేన శ్రీనివాస్ యాదవ్, బత్తుల రాజ్ కుమార్ యాదవ్, మక్కపల్లి కుమారస్వామి, వేణుమాధవ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వింధ్యావాలీ పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

కొత్తపల్లి, జూన్ 22 : జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలీ పాఠశాల పూర్వ విద్యార్థులు తమ గురువు శేషం పార్థసారథి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. పాఠశాలలో 1999 నుంచి 2010 వరకు తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసిన శేషం పార్థసారథి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో 2002 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఉపాధ్యాయుడికి సంతాప సభ నిర్వహించి, కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి. ప్రశాంత్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్షాల కోసం దేవాలయాల్లో జలాభిషేకం



గోపాల్‌పూర్‌లో నీళ్ల బిందెలతో ఆలయాలకు వెళ్తున్న గ్రామస్తులు

కరీంనగర్ రూరల్, జూన్ 22: వానకాలం సాగు పనులు ప్రారంభమై నెల గడిచినా వర్షాల జాడ లేకపోవడంతో ఆదివారం గోపాల్‌పూర్ గ్రామంలోని స్వయంభూ వినాయకుడితో పాటు, ఆలయాల్లో దేవతా మూర్తులకు గ్రామస్తులు, రైతులు జలాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ ఊరడి మంజులామల్లారెడ్డి, దుర్శేడ్ సింగిల్‌విండో వైస్ చైర్మన్ గోనే నర్సయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇంటింటి నుంచి బిందెలో నీళ్లు తీసుకొని వెళ్లి ఆయా ఆలయాల్లో దేవతా మూర్తులపై పోసి, విస్తారంగా వానలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని మొక్కులు పెట్టారు. కార్యక్రమంలో నాయకులు ముస్కు మల్లారెడ్డి, సంజీవ్, తిరుపతి, ఎస్ నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వందేళ్ల వృద్ధురాలి మృతి



చిన్నమ్మ (ఫైల్)

మానకొండూర్ రూరల్, జూన్ 22: మద్దికుంట గ్రామానికి చెందిన కెక్కర్ల చిన్నమ్మ (100) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు. చిన్నమ్మకు ఇద్దరు కుమారులు శంకరయ్య, కొమురయ్యతో పాటు ఆరుగురు కుమార్తెలు, 18 మంది మనుమలు, 20 మంది మనుమరాళ్లు ఉన్నారు. మనుమరాళ్లకు సైతం పెళ్లిల్లు కాగా, దాదాపు 10 మంది పిల్లలు ఉన్నారు. చిన్నమ్మ పార్థివదేహాన్ని కడసారి చూసేందుకు గ్రామస్తులు బారులు తీరారు.

## ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, జూన్ 22: కోర్కళ్ మానేరువాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్‌లను పట్టుకొని, వాటి డ్రైవర్లు నేదురు కనుకయ్య, ఎల్కపెల్లి రాజయ్య, ఎల్కపెల్లి సతీశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపతి ఆదివారం తెలిపారు. ట్రాక్టర్‌లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

తిమ్మాపూర్ రూరల్, జూన్ 22: మానకొండూర్ మండలం లింగాపూర్ నుంచి పోరండ్లకు ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ పిట్టల అనిల్ కుమార్, ట్రాక్టర్ ఓనర్ మొగిలి పాక అవినాష్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

## లారీ, బైక్ ఢీ: ఒకరికి తీవ్రగాయాలు

వీణవంక, జూన్ 22: పోతిరెడ్డిపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ, బైక్ ఢీకొనగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, ఈఎంటీ బుచ్చిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన తోడేటి రమేశ్ (40) పనిపై జమ్మికుంటకు తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా, పోతిరెడ్డిపల్లి శివారులో ఎదురుగా వచ్చిన లారీని ఢీకొనగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా, రమేశ్‌కు ప్రథమ చికిత్స అందించి జమ్మికుంట ప్రభుత్వ దవాఖానలో చేర్పించినట్లు ఈఎంటీ తెలిపారు.

# ఆయిల్ పామ్ సాగుపై దృష్టి పెట్టాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పక్కన మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 22: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు తెచ్చిపెట్టే ఆయిల్ పామ్ పంట విస్తరణపై దృష్టి పెట్టాలని, రైతుల్లో అవగాహన పెంచి, నిర్దేశించిన లక్ష్యానికి మించి తోటలు పెంచేలా ప్రోత్సహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించారు. ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి కరీంనగర్‌కు వచ్చారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో వ్యవసాయం, విద్య, గృహనిర్మాణం, పంచాయతీరాజ్ శాఖల పనితీరుపై ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు, సంబంధితశాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి తుమ్మల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ఉమ్మడి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని సూచించారు. వచ్చే నెల నాటికి అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. రాబోయే మూడున్నరేండ్లలో శాచురేషన్ పద్ధతిలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యాశాఖ యంత్రాంగం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తీవ్రంగా కృషి చేయాలన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ఎమ్మెల్యేలు అందించే నిరుపేదల జాబితాలు కూడా పరిశీలించి, అర్హులైన వారికి పార్టీలకతీతంగా ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులు దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వరి సాగు కొంతమేర తగ్గిస్తూ ఆయిల్ పామ్ పంట సాగు చేసేలా రైతుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. బడి బాట కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు విద్యాశాఖాధికారులు కృషి చేయాలన్నారు. సమీక్ష అనంతరం జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నంతో కలిసి తుమ్మల ప్రారంభించారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్, డాక్టర్ సంజయ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు హర్కార్ వేణుగోపాల్, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు సత్యప్రసాద్, కోయ శ్రీహర్ష, సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, జనక్‌ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### విద్యాశాఖ పనితీరుపై అసంతృప్తి

ఉమ్మడి జిల్లాలో విద్యాశాఖ తీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు కోరుట్ల, మానకొండూర్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, కవ్వంపల్లి సత్యనారాయణ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు నాణ్యమైన విద్యను అందించడంలో విఫలమయ్యారని విమర్శించారు. తన నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టిన సందర్భంలో పదో తరగతి చదివే విద్యార్థి ఐదో తరగతి పుస్తకాలు చదవలేక పోతున్నాడని ఎమ్మెల్యే కవ్వంపల్లి వ్యాఖ్యానించడంతో వేదికపై ఉన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్లు అవాక్కయ్యారు. డీఈవో మొండయ్య మాట్లాడుతున్న సమయంలో కాగితాలపై ఉన్న ప్రగతి కాదు.. క్షేత్రస్థాయిలో చేపట్టే పరిశీలనపై వివరాలు వెల్లడించాలని మంత్రి పొన్నం అడగడంతో డీఈవో మిన్నకుండిపోయారు.

### అకాడమిక్ బ్లాక్‌కు శంకుస్థాపన

కమాన్‌చౌరస్తా, జూన్ 22: జిల్లా కేంద్రంలో మానేరు డ్యాం సమీపంలోని శాతవాహన ఫార్మసీ కళాశాలలో అకాడమిక్ బ్లాక్, ప్రహరీకి ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నదని, విశ్వవిద్యాలయాల్లో నాణ్యతా ప్రమాణాలు పెంచుతామని పేర్కొన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, శాతవాహన విశ్వవిద్యాలయ అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ, పీఎం ఉష కింద విడుదలయ్యే నిధులను ఈ అకాడమిక్ బ్లాక్ నిర్మాణానికి కేటాయించినట్టు తెలిపారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల కోసం విశ్వవిద్యాలయంలో అన్ని రకాల సౌకర్యాలను సమకూరుస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతోపాటు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, ఓఎస్‌డీ డాక్టర్ హరికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పాడి కౌశిక్‌రెడ్డితో నీకు పోలికా

- స్థాయిని మరిచి విమర్శలు చేయడం మానుకో
- వొడితెల ప్రణవ్‌పై బీఆర్ఎస్ నేతల ధ్వజం



వీణవంకలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వీణవంక, జూన్ 22: కాంగ్రెస్ నాయకుడిగా చెప్పుకొనే వొడితెల ప్రణవ్ స్థాయిని మించిన విమర్శలు చేస్తూ బఫూన్‌లా వ్యవహరిస్తున్నాడని హుజూరాబాద్ బీఆర్ఎస్ నేతలు ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం హుజూరాబాద్ మండలంలో ప్రణవ్ చేసిన విమర్శలను గులాబీ నేతలు తిప్పికొట్టారు. ప్రణవ్ గతంలో బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నాడని గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరి నీతులు వల్లిస్తున్నాడని విమర్శించారు. ప్రణవ్‌ను అసలు ఎవరూ నాయకుడిగా గుర్తించడంలేదని, ఆయన వార్డు మెంబర్ స్థాయి కూడా కాదని ఎద్దేవా చేశారు. ఒక వార్డు మెంబర్ స్థాయి కూడా లేని ప్రణవ్ గొప్ప నాయకులపై విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి జనంలో నుంచి వచ్చిన నాయకుడని, ప్రజలు మెచ్చిన నేత అని కొనియాడారు. కౌశిక్‌రెడ్డికి పెరుగుతున్న ప్రజాదరణను జీర్ణించుకోలేక అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కేసులకు బెదిరేది లేదని స్పష్టం చేశారు. ప్రణవ్ ఇప్పటికైనా స్థాయిని మరిచి విమర్శలు మానుకోవాలని, లేకుంటే రాబోయే కాలంలో ప్రజలు బుద్ధి చెప్తారని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, బొబ్బల శ్రీధర్‌రెడ్డి, చరణ్, భార్గవ్, మర్రి క్రాంతి, బీఆర్ఎస్వీ నాయకులు రాహుల్, దాసారపు శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ ఎడ్ల రాకేశ్, కార్యకర్తలు నాగరాజు, రఘువరన్, మహేశ్, వినయ్, రాజశేఖర్, రాజిరెడ్డి, సురేశ్, దిలీప్, శ్రీకాంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణదారులు దౌర్జన్యం చేస్తున్నారని..

- సింగాపూర్‌లో రైతు ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రైతు ఐలుమల్లు

హుజూరాబాద్ రూరల్, జూన్ 22: ప్రభుత్వ భూమి ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోగా, ఆక్రమణదారులకే వత్తాసు పలుకుతున్నారని, దీంతో వారు తనపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఆరోపిస్తూ సింగాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు ఆత్మహత్యకు యత్నించాడు. సదరు రైతు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులో 14ఏ డీబీఎం కాకతీయ కాలువ పరిధిలోని 87 సర్వే నంబరులో 12 ఎకరాల 21 గుంటల వ్యవసాయ భూమి ఉంది. దీన్ని కొన్ని సంవత్సరాల క్రితం ఇదే గ్రామానికి చెందిన బైరి రామస్వామి వద్ద నుంచి ముష్క మల్లయ్య, అశోక్ కుమార్ కొనుగోలు చేశారు. ఇందులో నుంచి ఎకరం 11 గుంటల భూమి కాకతీయ కాలువ కింద పోయింది. అప్పుడు ప్రభుత్వం పరిహారం ఇచ్చింది. అయినప్పటికీ రెవెన్యూ అధికారుల తప్పిదంతో ఈ భూమికి పట్టా ఇచ్చారు. దీనిపై ఈ భూమి పక్కన ఉన్న రైతు అమ్ముల ఐలుమల్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అయినప్పటికీ వారు పట్టించుకోలేదు. ఎస్సారెస్పీ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు సర్వే చేసి ఎకరం 11 గుంటల భూమి ఎస్సారెస్పీదేనని తేల్చారు. అందులో నుంచి మట్టి తీయడం, ఆక్రమించడం చేయవద్దని సంబంధిత రైతులు ముష్క మల్లయ్య, అశోక్‌కుమార్‌ను హెచ్చరించారు. అయినప్పటికీ గత రెండు రోజుల నుంచి ముష్క మల్లయ్య కుటుంబ సభ్యులు ఎస్సారెస్పీ భూమి నుంచి మట్టి తవ్వకాలు చేపట్టారు. దీనిపై ఐలుమల్లు మళ్లీ ఎస్సారెస్పీ అధికారులతో పాటు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేసిన పోలీసులు, ఎస్సారెస్పీ భూమిలో మట్టి తవ్వకాలు చేస్తున్న మల్లయ్య కుటుంబ సభ్యులకే వత్తాసు పలికినట్టు ఐలుమల్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలో ఎవరికి ఫిర్యాదు చేసినా భూ ఆక్రమణ, మట్టి తవ్వకాలు ఆగడం లేదని, తాను అడ్డుకుంటే ఆక్రమణదారులు తనపై దౌర్జన్యం చేస్తున్నారని మనస్తాపం చెందిన ఐలుమల్లు శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనను చికిత్స కోసం హనుమకొండలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించినట్లు చెప్పారు.

## బెదింపులకు గురిచేసిన ముగ్గురిపై కేసు

గన్నేరువరం, జూన్ 22: హన్మాజీపల్లి గ్రామ శివారులోని క్వారీ నడవాలంటే తమకు ప్రతి నెలా డబ్బులు ఇవ్వాలని బెదిరించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన ముగ్గురు శనివారం రాత్రి క్వారీ వద్దకు వచ్చి బెదిరించి రూ.2 వేలు తీసుకెళ్లారని సూపర్‌వైజర్ దేశ్‌ముఖ్ చేయగా, కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు.

## కూలిపని కోసం వచ్చి మృత్యుఒడికి

- చిగురుమామిడి శివారులో ఆటో బోల్తా.. ఒకరి మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు

చిగురుమామిడి, జూన్ 22: వ్యవసాయ కూలిపనుల కోసం పొరుగు రాష్ట్రం నుంచి భార్య, బంధువులతో కలిసి వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇవి.. కృష్ణా జిల్లా కోడూరు మండలం ఓటగుండం గ్రామానికి చెందిన 18 మంది మూడు రోజుల క్రితం చిగురుమామిడికి వరి నాట్లు వేసేందుకు వచ్చారు. ఇంకా పనులు ప్రారంభం కాకపోవడంతో తిరిగి స్వస్థలానికి పయనమయ్యారు. ఆదివారం చిగురుమామిడి నుంచి కరీంనగర్‌కు రెండు ఆటోల్లో బయలుదేరారు. ఒక్కో ఆటోలో తొమ్మిది మంది చొప్పున కూర్చున్నారు. చిగురుమామిడి గ్రామ శివారులో కరీంనగర్ నుంచి హుస్నాబాద్ వైపు వెళ్తూ ఓ కారు ఎదురుగా రాగా, డ్రైవర్ ఆటో(ఏపీ 15 టీఏ 6063)ను రోడ్డు పక్కకు తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ముందు కూర్చున్న కందుల సురేశ్ (43) తలకు తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేశ్ మృతి చెందాడు. అదే ఆటోలో ఉన్న దావనబోయిన శ్రీరాములు, దావనబోయిన నాంచారమ్మ, దావనబోయిన కృష్ణకుమారి, మాగంటి కుమారికి తీవ్ర గాయాలయ్యాయి. వారు కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వెనుక ఆటోలో ప్రయాణిస్తున్న కందుల సురేశ్ భార్య వనజాక్షి భర్త మృతదేహంపై పడి విలపించడం అందరినీ కంటతడి పెట్టించింది. సురేశ్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పొట్టకూటి కోసం ఇక్కడికి వచ్చి పని లేక తిరిగి వెళ్తూ మృత్యువాత పడడంతో బంధువులు కంటతడి పెట్టారు.

## కారు ఢీకొని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి దుర్మరణం

శంకరపట్నం, జూన్ 22: మండలంలోని తాడికల్ గ్రామంలో గుర్తు తెలియని ఓ కారు ఢీకొట్టడంతో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన అనవేని కనకయ్య (65) సింగరేణిలో ఉద్యోగం చేసి ఇటీవల రిటైర్డ్ అయ్యాడు. ఆదివారం తన ఇంటి నుంచి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా అంబాల్‌పూర్ వైపు నుంచి తాడికల్ ప్రధాన రహదారి వైపు వేగంగా వస్తున్న ఓ గుర్తు తెలియని కారు ఢీకొట్టి అదే వేగంతో కరీంనగర్ వెళ్లిపోయింది. ఈ ఘటనలో కనకయ్య తీవ్ర గాయాలతో అక్కడికక్కడే చనిపోయాడు. ఘటనా స్థలానికి వెళ్లిన ఎస్‌ఐ కట్కూరి శేఖర్‌రెడ్డి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు.

## కరీంనగర్ చేరిన ఉపాధ్యాయుడి మృతదేహం

విద్యానగర్, జూన్ 22: కరీంనగర్ కశ్మీర్ గడ్డకు చెందిన ఖాజా మెహరాజ్ (46) మృతదేహం ఆదివారం కరీంనగర్‌కు చేరింది. ఎనిమిది సంవత్సరాలుగా గల్ఫ్ దేశం షార్జాలో ఉంటున్న ఆయన అక్కడి అల్ ఖైరిన్ బాయ్స్ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్నారు. ఈనెల 16న మెహరాజ్ హఠాన్మరణం చెందారు. వారం రోజులుగా మృతదేహం కోసం కుటుంబ సభ్యులు నిరీక్షిస్తున్నారు. మెహరాజ్ భార్య హసీనా సుల్తానా, కుటుంబ సభ్యులు షార్జా వెళ్లి అక్కడి బంధువుల సహకారంతో కార్యక్రమాలు పూర్తి చేయించగా, ఆదివారం ఉదయం నాలుగు గంటల సమయంలో మృతదేహం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరింది. 11 గంటలకు కరీంనగర్‌కు తీసుకురాగా, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

## ఎస్‌బీఐ పేరిట సైబర్ మోసాలు

- రివార్డులు పొందాలంటూ వాట్సాప్ గ్రూపుల్లో మెస్సేజ్‌లు




నగునూర్ రైతు వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన మెస్సేజ్

కరీంనగర్ రూరల్, జూన్ 22: గ్రామాల్లో సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నారు. ఎస్‌బీఐ యోనో పేరిట రూ.5,687 రివార్డు ఇస్తున్నారని, క్లయిమ్ చేసుకోవాలని నగునూర్‌కు చెందిన ఓ వ్యక్తి పేరిట అన్ని వాట్సాప్ గ్రూప్‌ల్లో మెస్సేజ్ ఫార్వర్డ్ చేశారు. రిడీమ్ చేసుకోవాలని ఏపీకే లింక్‌ను కూడా పంపించారు. కొందరు ఈ మెస్సేజ్ నమ్మి ఓపెన్ చేయడానికి ప్రయత్నించారు. అయితే ఎంత మంది హ్యాక్ అయ్యారో తెలియాల్సి ఉంది. ఓ వైపు అధికారులు సైబర్ మోసాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, మరోవైపు బహుమతులు, గిఫ్ట్ ఓచర్‌ల పేరిట వచ్చే మెస్సేజ్‌లకు జనం ఆకర్షితులవుతూనే ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం బాధ్యులు

## పద్మనాయక వెలమ సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం

తెలంగాణచౌక్, జూన్ 22 : జిల్లా కేంద్రంలోని పద్మనాయక వెలమ సంఘం వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ముకరంపురలోని పద్మనాయక మినీ కల్యాణ మండపంలో అధ్యక్షుడు జువ్వాడి వేణుగోపాల్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘ సభ్యులు హాజరు కాగా, వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం ఎజెండా అంశాలపై చర్చించి, ఆమోదించారు. అనంతరం ప్రధాన హాలును ఏ/సీ హాలుగా పునఃనిర్మాణం చేసేందుకు సహకరించిన దాతలను సన్మానించారు. ప్రస్తుత పాలకవర్గ పదవీ కాలం ముగుస్తున్నందున, హాల్ నిర్మాణం కొనసాగుతున్న క్రమంలో జనరల్ బాడీ పదవీ కాలం మరో నాలుగు నెలలు ఏకగ్రీవంగా పొడిగించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జువ్వాడి వేణుగోపాల్ రావు, ప్రధాన కార్యదర్శి చీటి ప్రకాశ్‌రావు, ఉపాధ్యక్షుడు గండ్ర సంపత్‌రావు, సంయుక్త కార్యదర్శి బోయినపల్లి భూపతిరావు, కోశాధికారి నిమ్మనేని భీంరావు, కార్యవర్గ సభ్యులు జువ్వాడి అనిల్‌రావు, వాల శంకర్‌రావు, చిట్నేని మోహన్‌రావు, సుంకిశాల సంపత్‌రావు, జూపెల్లి మాధవరావు, చిట్నేని రఘురాం రావు, జోగినపల్లి రాజగోపాల్‌రావు, పల్లేపాటి వేణుగోపాల్‌రావు, అయిల్నేని సుధాకర్‌రావు, గండ్ర మంజుల తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం డివిజన్ల పునర్విభజన చేపట్టాలి




మాట్లాడుతున్న మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్

కార్పొరేషన్, జూన్ 22: కరీంనగర్ నగర పాలక సంస్థ డివిజన్ల విభజన జీవో నంబర్12 ప్రకారం చేపట్టాలని, లేకపోతే కోర్టును ఆశ్రయిస్తామని మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పారదర్శకంగా డివిజన్ల రూపకల్పనకు 2021లో కేసీఆర్ ప్రభుత్వం జీవో12 తీసుకొచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో12 ఆధారంగా జీవో 269ను విడుదల చేసిందని, దీని ప్రకారం కార్పొరేషన్‌లో కనీసం 5వేల ఓటర్లతో మాత్రమే నూతన డివిజన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నట్లు తెలిపారు. ఈ నెల 16న జిల్లాలోని మజ్లిస్ మాజీ కార్పొరేటర్లు, కార్యవర్గ సభ్యులందరూ ఓవైసీ దగ్గరకు వెళ్తే, ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి డివిజన్‌ల ఏర్పాటుకు గంటల పాటు చర్చించారని ఆరోపించారు. దీనికి సంబంధించి తమ వద్ద పక్కా సాక్ష్యాధారాలు ఉన్నాయని, నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటారా అని మంత్రి పొన్నంను ప్రశ్నించారు. నగర అభివృద్ధిపై ఒక రోజు కూడా మాట్లాడని మంత్రి, ఎన్నికలు రాగానే ఇష్టానుసారంగా వ్యవహరించి ఓట్ల దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, అధికారులు పారదర్శకంగా డివిజన్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, పెండ్యాల మహేశ్, తూల భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## తపాలా ఉద్యోగుల సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలి

హుజూరాబాద్ టౌన్, జూన్ 22: తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్–సీ, ఎన్ఎఫ్‌పీఈల గుర్తింపును వెంటనే పునరుద్ధరించాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యూ మహేందర్, శ్రవణ్ కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో అత్యున్నత న్యాయ స్థానాలు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయక, ఉద్యోగ సంఘాలను అణచివేసే ధోరణితో వ్యవహరించడం అత్యంత శోచనీయమని పేర్కొన్నారు. కొత్త వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవాలని దేశ వ్యాప్తంగా రైతులు చేపట్టిన పోరాటానికి తపాలా ఉద్యోగుల సంఘం ఏఐపీఈయూ–గ్రూప్ సీ మద్దతు ఇచ్చిందన్న కల్పిత, నిరాధార ఆరోపణలతో కూడిన ఫిర్యాదుపై కేంద్రం స్పందించి గుర్తింపును రద్దు చేసిందని తెలిపారు. దీనివల్ల తపాలా ఉద్యోగ సంఘానికి అధికారులతో ఉన్న సంప్రదింపుల హక్కులకు విఘాతం కలిగిందని పేర్కొన్నారు. గుర్తింపు పునరుద్ధరించాలని న్యాయస్థానాలు ఇచ్చిన ఆదేశాలు అమలయ్యేలా జోక్యం చేసుకోవాలని ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వినతిపత్రం అందించామని తెలిపారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మొదటి తపాలా ఉద్యోగుల సంఘం ఎన్ఎఫ్‌పీఈ మాత్రమేనని, అలాంటి సంఘాన్ని అణచివేయాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు.

## మాజీ ఎంపీటీసీ శోభకు నివాళి



రేకొండలో చాడ శోభ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు

చిగురుమామిడి, జూన్ 22: మండలంలోని రేకొండ గ్రామంలో ఆదివారం మాజీ ఎంపీటీసీ చాడ శోభ సంస్మరణ సభను ఆమె కుమారులు చాడ శ్రీధర్ రెడ్డి, చాడ మురళి మనోహర్ రెడ్డి నిర్వహించగా, సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. ఎంపీటీసీగా చాడ శోభ గ్రామాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఆమె మృతి గ్రామానికి తీరనిలోటన్నారు. శోభ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు చెరుకు శ్రీనివాస్ రెడ్డి, మామిడి అంజయ్య, అందే స్వామి, బోయిని అశోక్, పెసరి రాజేశం, కోమటిరెడ్డి జైపాల్ రెడ్డి, గోలి బాపురెడ్డి, బూడిద సదాశివ, ముద్రకోల రాజయ్య, గూడెం లక్ష్మి, కోహెడ సృజన్ కుమార్, కోన లెనిన్, నాగెల్లి లక్ష్మీరెడ్డి, బిళ్ల జైపాల్ రెడ్డి, ఐరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా గంప వెంకన్న

గన్నేరువరం, జూన్ 22: మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన గంప వెంకన్న మున్నూరు కాపు సంఘం మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవన్న నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గంప వెంకన్న మాట్లాడుతూ, మున్నూరు కాపుల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడతానన్నారు.

## పేద విద్యార్థినులకు చేయూత

కమాన్‌చౌరస్తా, జూన్ 22 : జిల్లా కేంద్రానికి చెందిన ఉపాధ్యాయిని వఘుల ప్రణీత, కే అన్వేష్ పేద విద్యార్థినులకు చేయూతనందించారు. అన్వేష్ తల్లి, ఉపాధ్యాయిని సుహాసిని ఐదు సంవత్సరాలుగా పేద విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీని వఘుల ప్రణీతతో కలిసి అందజేస్తుండగా, ఇటీవల సుహాసిని మృతిచెందారు. ఈ క్రమంలో ఆమె సిద్ధాంతాలను గౌరవించి తాను సైతం పేద విద్యార్థినులకు పుస్తకాలు అందజేసేందుకు ముందుకు వచ్చినట్లు అన్వేష్ తెలిపారు. ఆదివారం ప్రణీత నివాసంలో వేములవాడ మండలం హన్మాజీపేట గామానికి చెందిన విద్యార్థినులు చిత్తారి గంగాజల, చిత్తారి సౌజన్యకు స్టేషనరీ, పుస్తకాలు అందజేశారు.

## గుర్తు తెలియని లారీ ఢీకొని ఆటోట్రాలీ బోల్తా

హుజూరాబాద్ రూరల్, జూన్ 22: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులోని కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై ఆదివారం గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో ఐస్‌క్రీం ఆటోట్రాలీ బోల్తాపడింది, స్థానికుల కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన యువకుడు నిత్యం ఐస్‌క్రీం ఆటో ట్రాలీని హుజూరాబాద్ నుంచి తీసుకువచ్చి తుమ్మనపల్లి సమీపంలో రోడ్డు పక్కన పెట్టుకొని జీవనోపాధి పొందుతుంటాడు. ఐస్‌క్రీం ట్రాలీని హుజూరాబాద్ నుంచి తుమ్మనపల్లి శివారులో పార్కింగ్ చేస్తుండగా, వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ట్రాలీ బోల్తాపడగా డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లారీ ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

## బీసీ వసతి గృహాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి

తెలంగాణచౌక్, జూన్ 22: జిల్లా వ్యాప్తంగా బీసీ వసతి గృహాలకు శాశ్వత భవనాలను నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అద్దె భవనల్లో నిర్వహిస్తున్న బీసీ వసతి గృహాల్లో మౌలిక వసతుల్లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి స్థలాలు కేటాయించి, శాశ్వత భవనాలు నిర్మించాలని కోరారు.